


**ఏపిలో సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -80 బుధవారం 26 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

**ఎన్నికల వయసు తగ్గింపుపై కీలక తీర్మానం!**

**ఎన్నికల్లో పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించాలని తీర్మానం చేసే అవకాశం**

**తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్న రేవంత్ ప్రభుత్వం**

**నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని శాసనసభ్యులకు సూచన**



**హైదరాబాద్ ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మిగతా2లో...

## మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ వేగవంతం చేయండి

**ల్యాండ్ ఫూలింగ్ పై స్పష్టమైన విధానం రూపొందించండి**

**సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ల్యాండ్ ఫూలింగ్ పై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆయన వారికి సూచించారు. మంగళవారం హైదరాబాద్ లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మూసీ ప్రాజెక్టు, ఆ నది ప్రక్షాళనపై సీఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ తదితర అంశాలపై స్పష్టమైన విధానాన్ని రూపొందించి సమర్పించాలంటూ ఆదేశించారు. ఇదే సమయంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా చూసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని కోరారు. మిగతా2లో...





## ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

**- స్పష్టమైన కార్యాచరణతో పనులు వేగవంతం చేయాలి**

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**హైదరాబాద్,ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా వందశాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నాడు జలసౌధలో దేవాదుల ప్రాజెక్టు పై జరిగిన మిగతా2లో...

## తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

**రూ.840.41 కోట్లతో విస్తరణకు కేంద్రం ఆమోదం**

**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి**




## వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి

- నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలి
- ప్రతి ఒక్కరికి పని కల్పించి ఆదుకోవాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క




## సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

● వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి ● ఎల్‌నినో ప్రభావంతో పంటల మార్పిడి జరగాలి ● నీట్ పరీక్ష పక్కాగా జరిగేలా చర్యలు ● కలెక్టర్లకకు సిఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం




## విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి
- సిఎం రేవంత్‌కు బాధ్యతారాహిత్యం కూడదు
- బిజెపి సభలో ఎంపి ఈటలె రాజేందర్ విమర్శలు
- స్వల్పంగా దెబ్బతిన్న రామచంద్ర రావు ఆరోగ్యం



**హైదరాబాద్,ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అంటే అర్థం ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదేనని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'ఫీజు బకాయి - భాజపా లడాయి' పేరుతో మిగతా2లో...

## సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

**ఎందుకు అమెరికా పర్యటనో వివరంగా చెప్పాలి**

**మేయర్ మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో చెప్పాలి**

**నిబంధనల మేరకే కేంద్ర విదేశాంగశాఖ నిర్ణయాలు**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ,ఆఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో మం గళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు.

మిగతా2లో...



## 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ

**పొంగులేటిని వెంటనే బర్తర్ఫ్ చేయాలి**

**అసెంబ్లీలో ఈ అంశంపై సర్కార్‌ను నిలదీస్తాం**

**బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్**

**హైదరాబాద్,ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** మొత్తం 22ఎ నిషేధిత భూముల అక్రమాలపై తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసలు ఈ భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారో నిజాలు బయటపడాలని బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, నిషేధిత జాబితాను వెబ్‌సైట్‌లో

మిగతా2లో...

## వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి



**హైదరాబాద్ ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలతో నివేదికను పొందు పరిచి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌కు అందజేశామని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి స్పష్టం చేశారు. దీనిని పార్టీ రాష్ట్ర వ్యవహారాల

మిగతా2లో...

# సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని శాసనసభ్యులకు వెల్లడించారు. అయితే, ఈ సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయి, సభా అజెండా ఏమిటన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఒక కీలక తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ సభలో తీర్మానం చేయనున్నారు. అనంతరం దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపి, పార్లమెంటులో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టాలని కోరనున్నారు. చట్టసభల్లో యువతకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ మార్పును ప్రతిపాదిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే పేర్కొన్నారు.

నియోజకవర్గాల అభివృద్ధి పనులపై కూడా ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్ష జరిపారు. పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆయన ఎమ్మెల్యేలను ఆదేశించారు. భూసేకరణలో జాప్యం జరిగితే ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ శాఖ అనుమతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ ఛైర్మన్ మరియు సభ్యులపైన ఉన్నదన్నారు. గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కమిటీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార మార్గాలను సూచించాలి. కమిటీల సభ్యులు ప్రజల నుంచి వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... లెజిస్లేటివ్ కమిటీలు ప్రభుత్వం మరియు ప్రజల మధ్య ఒక ముఖ్యమైన వారధిగా పని చేయాలన్నారు. తద్వారా పథకాల అమలులో ప్రభుత్వం మెరుగైన ఫలితాలు సాదించేందుకు మరియు ప్రజలకు పథకాలు మరింతగా చేరువయ్యేందుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 10.45 శాతం మంది ఉన్న షెడ్యూల్డ్ తెగల జీవన పరిస్థితులను అధ్యయనం చేయడం, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును సమీక్షించడం, లోటుపాట్లను గుర్తించడం, వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన సూచనలను ప్రభుత్వానికి అందించడం ఈ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ ప్రధాన కర్తవ్యం అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం మరియు సమ్మిళిత అభివృద్ధి అనే ఆదర్శాల పట్ల మనందరి సమిష్టి నిబద్ధతకు వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటి ప్రతీక. కమిటీలు ప్రజల అవసరాలను అర్థం చేసుకుని, అర్థవంతమైన సిఫార్సుల ద్వారా వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి దోహదపడాలి.

మహిళల భద్రత మరియు ఆర్థిక సాధికారతకు సంబంధించిన పథకాలు, శిశు సంక్షేమ సంస్థలు మరియు అంగన్వాడీల పనితీరు, దివ్యాంగులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అలాగే వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న జీవన పరిస్థితులు మరియు ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై కమిటీ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శాసన వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... శాసనమండలి సంయుక్త కమిటీలు అత్యంత ప్రభావితమైనవి. బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ సంయుక్త కమిటీ సూచనలు, సలహాలు ఉపయోగపడుతాయి. క్షేత్ర స్థాయిలోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలతో ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కరించవచ్చు.

# 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు బ్లాక్ చేశారో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజల భూములతో చెలగాటమాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరారు. బాధితుల పక్షాన నిలబడి సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని, సభను స్తంభింపజేసి అయినా బాధితులకు న్యాయం జరిగేలా పోరాడతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తమ్ముడికి మాత్రం వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కట్టబెడతారని, సామాన్య ప్రజల ఆస్తులను మాత్రం 22ఎలో పెట్టి ఇబ్బందుల పాలు చేస్తారని హరీశ్ రావు విమర్శించారు. చివరికి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్, సీఎం ఇల్లు కూడా 22ఎ నిషేధిత జాబితాలోనే ఉన్నాయంటే ఈ ప్రభుత్వ పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కును కూడా రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారని, ఇలా అమ్ముకుంటూ పోతే రేపు బడికి, గుడికి, చివరకు స్మశాన వాటికకు కూడా భూమి మిగలదని ధ్వజమెత్తారు. కమిషన్ల కక్కుర్తి కోసమే సామాన్య ప్రజల ఆస్తులను ప్రభుత్వం నిషేధిత జాబితాలోకి నెట్టిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఎలోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ ఎం.జే. గార్డెన్స్‌లో 22ఎ భూముల సమస్యలతో సతమతమవుతున్న బాధిత కుటుంబాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న తదితరులతో కలిసి బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించారు. 22ం కుట్ర వెనుక భారీ కమీషన్ల బాగోతం దాగి ఉందన్న ఆయన, ఈ అక్రమాల్లో ఏ-1గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏ-2గా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. 50-50 కమీషన్ల కోసమే లక్షలాది మంది ప్రజలను నిద్రలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. 98 శాతం భూములను 22ం జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఇక్కడికి ఎందుకు వస్తారని ప్రశ్నించారు.

# సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

**హైదరాబాద్,ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** సీజనల్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలనిఅధికారులకు సీఎస్ సంజయ్ జాజు సూచించారు. వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, ప్రజలకు అవసరమైన సేవలు, నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఆయా అంశాలపై చేపడుతున్న చర్యలను కలెక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇక నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ ప్రత్యేకంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా తదితరత అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ఈ ప్రవేశపరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరిచి వ్యవసాయసాగుకు అనుసరించాల్సిన నూతన విధానాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల వారీగా సీజనల్ పరిస్థితులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) అవసరాన్ని చెబుతూ, తక్కువ నీటి అవసరం ఉండే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేసేలా రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

భాజపా చేపట్టిన కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. సీఎం ఒకసారి రాష్ట్రంలోని విద్యార్థుల పరిస్థితి గురించి ఆలోచించాలన్నారు. 20లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యతను భాజపా తీసుకుందని పేర్కొన్నారు. 'నా విద్యార్థులు, నా యువత క్వాలిటీగా ఉండాలి.. ఆరోగ్యవంతులుగా ఉండాలి' అని కలలు కంటున్న నాయకుడు నరేంద్ర మోదీ అని వివరించారు.

పేద తల్లిదండ్రుల పిల్లలు కూడా గొప్పగా చదువుకొని డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, ఉన్నతాధికారులు కావాలని కలలు కంటున్నారని, అదే నిజమైన తెలంగాణ అభివృద్ధిగా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రామచందర్ రావు చేస్తున్న ఈ 48 గంటల దీక్షకు బీజేపీ అండగా ఉందన్నారు.

ఫీజుల బకాయిలు చెల్లించే వరకు.. తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అస్వస్థతకు గురయ్యారు. రామచందర్ రావును పరీక్షించిన వైద్యులు.. బీపీ 90/60గా ఉన్నట్లు తెలిపారు.'ఫీజు బకాయి-భాజపా లడాయి' పేరుతో భాజపా నేతలు రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రామచందర్ రావు దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్ పలువురు భాజపా నేతలు మద్దతు తెలిపారు.

# సీఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు.ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు.

ఇది సాధారణ పక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

మామ్దానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు.

గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు.

కుల గణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని తెలిపారు. హైదరాబాద్‌లో 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కుల గణనపై అవగాహన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

**న్యూఢిల్లీ,ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 365బీబీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుట్టాయగూడెం-ఎల్ఎన్‌డీ పేట, పట్టిసీమ-కొవ్వూరు సెక్షన్ల మధ్య 45.09 కిలోమీటర్లతో రహదారి ఉన్నతీకరణ కోసం రూ.840.41 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 45 కిలోమీటర్ల 2 లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నట్లు గడ్కర్ తెలిపారు. ఈ రహదారి ఉన్నతీకరణతో పోలవరం ప్రాజెక్ట్, పరిసర గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పొగాకు, చెరకు, ఫామాయిల్ తోటలతో నిండి ఉంటుందని.. ఈ హైవే అభివృద్ధితో మౌలిక సదుపాయాలు మెరుగు అవుతాయన్నారు. పంటల రవాణా వేగంగా, సురక్షితంగా జరుగుతుందని చెప్పారు. పంట పొలాల నుంచి మార్కెట్‌కు అనుసంధానం పెరుగుతుందని, స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుందని గడ్కరీ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ చేసిన జాతీయ రహదారితో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇరురాష్ట్రాల ప్రయాణికులకు, పర్యాటకులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులు సులభంగా ఘాట్ల వద్దకు చేరుకోవడానికి, పోలవరం ప్రాజెక్ట్ సందర్శించేందుకు వీలవుతుందన్నారు.

# వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు పంపారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..గత విషయాలను కూడా పరిగణలోకి తీసుకున్నామని వివరించారు. ఈ నివేదికను ఏఐసీసీ చీఫ్, పార్టీ జనరల్ సెక్రటరీకి కూడా పంపిస్తారని అన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.నాయకులు, క్యాడర్‌కు ఒక మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నామని మల్లు రవి తెలిపారు. పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు.

# మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ వేగవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టుల నిర్మాణానికి అతి తక్కువ వడ్డీకి రుణాలిచ్చే సంస్థలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. టీడీఆర్ పై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలన్నారు. మంచిరేవుల ఓంకారేశ్వర స్వామి ఆలయ టెండర్లను తక్షణమే పిలవాలంటూ సూచించారు. కొత్వాల్ గూడలోని బర్డ్స్ పార్కుకు మరింత ప్రచారం కల్పించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫ్ రాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త బోధించిన జీవన విధానం ఆదర్శప్రాయం

మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ, మానవత్వం, క్రమబద్ధమైన జీవన విధానం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన సందేశాలు ప్రపంచ శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు.

# ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రాజెక్టు పనులను ప్రారంభం నుంచి ముగింపు వరకు సమగ్రంగా సమీక్షించి, ఎక్కడ పనులు నిలిచిపోయాయి, అందుకు కారణాలేంటి.. వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలేంటి అనే అంశాలను పాయింట్‌వారీగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమస్యను గుర్తించకుండా పనులు పూర్తవుతాయి అంటూ కాలయాపన చేయడం సరికాదని, ప్రతి సమస్యకు స్పష్టమైన పరిష్కారం, బాధ్యత, గడువు నిర్ణయించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులు, నిధులు, కాంట్రాక్టు ఏజెన్సీలకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు, ఇంజినీర్లు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉన్న అధికారులతో స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు సమగ్ర సమీక్ష నిర్వహించి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్య ఎక్కడ ఉందో ముందుగా గుర్తించాలి.. కారణాన్ని విశ్లేషించాలి.. పరిష్కారాన్ని ఖరారు చేసి అమలు చేయాలి. ఫలితం వచ్చే వరకు నిరంతరం పర్యవేక్షించాలి. దేవాదుల పూర్తి విషయంలో ఎలాంటి కాలయాపనకు తావులేదుఅని మంత్రి స్పష్టం చేశారు.

# వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి



**హైదరాబాద్,ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంరక్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశర చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కూలీలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తగినంత పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఔఓఓ-ఈూ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని మార్గనిర్దేశర చేశారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని నిర్దేశిరచారు. మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధితో పాటు నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశిరచి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఉపాధి పనులతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశిరచారు. ఫార్మ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరగాలని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# పట్టు సాగుకు సర్కారు ప్రోత్సాహం

**రైతులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన.. అధిక దిగుబడులే లక్ష్యం**

**శాస్త్రీయ పద్ధతులతో నాణ్యమైన కోకూన్ ఉత్పత్తికి సూచనలు శాస్త్రవేత్త ఎస్ భువన**






**వరంగల్/బ్యూరో గీసుకొండ,ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):** పట్టు సాగును మరింత విస్తరించి రైతులకు మెరుగైన ఆదాయం అందించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అధికారులు తెలిపారు. పట్టు రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ, సాగులో ఎదురయ్యే సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు చూపిస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో మంగళవారం ఎంఆర్ఎంఏ 2.0 రైతుశాస్త్రవేత్తల పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు.కేంద్ర పట్టు బోర్డుప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం (సీఎస్‌బీఆర్ఎస్ఆర్ఎస్), ములుగు ఆధ్వర్యంలో పట్టు పరిశ్రమ శాఖ సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులతో శాస్త్రవేత్తలు, అధికారులు నేరుగా మాట్లాడారు. పట్టు సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉత్పత్తి పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు, కోకూన్ నాణ్యత మెరుగుపరిచే పద్ధతులపై విస్తృతంగా చర్చించారు.

**శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు**

సీఎస్‌బీఆర్ఎస్ఆర్ఎస్ ములుగు శాస్త్రవేత్త భువన ఎస్. మాట్లాడుతూ.. పట్టు రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. నేల సారాన్ని పెంచడం, మల్బరీ తోటలను సక్రమంగా నిర్వహించడం, అవసరమైన మేరకు నీరు, ఎరువులు అందించడం ద్వారా ఆకుల నాణ్యతను పెంచుకోవచ్చన్నారు.పట్టు పురుగులకు నాణ్యమైన మల్బరీ ఆకులను అందించడంతోపాటు పెంపక గదుల్లో పరిశుభ్రత, ఉష్ణోగ్రత, తేమను నియంత్రించాలని సూచించారు. పట్టు పురుగుల పెంపకంలో నాన్‌స్పిన్నింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే పురుగుల ఆరోగ్యం మెరుగుపడి నాణ్యమైన కోకూన్ ఉత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు.

**రైతులకు శాఖ అండగా..**

పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పట్టు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. రైతులు సాంకేతిక సలహాలను వినియోగించుకుని పట్టు సాగులో ఆధునిక పద్ధతులను పాటించాలని కోరారు.యాంత్రీకరణ ద్వారా సాగులో శ్రమ, ఖర్చును తగ్గించుకునే అవకాశాలను రైతులకు వివరించారు. పట్టు పరిశ్రమలో వస్తున్న ఆధునిక మార్పులపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించడమే ఎంఆర్ఎంఏ 2.0 కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**రైతులతో ముఖాముఖి:**

కార్యక్రమంలో పట్టు రైతులు శాస్త్రవేత్తలు, అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు పొందుతూ సాగులో తమకు ఎదురవుతున్న సమస్యలను వివరించారు. నేల పునరుద్ధరణ, మల్బరీ సాగు, యాంత్రీకరణ, పట్టు పురుగుల పెంపకం, నాన్‌స్పిన్నింగ్ సమస్యల నివారణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా ఉత్పాదకత, కోకూన్ నాణ్యతను పెంచుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ సెరికల్చర్ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీనివాసరావు, నంతనాయక్‌తండా గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొని రైతులతో చర్చించారు. సాంకేతికత ఆధారిత, స్థిరమైన పట్టు పరిశ్రమ అభివృద్ధికి రైతులకు అవసరమైన సహకారం అందిస్తామని వారు తెలిపారు.

# ఆర్టీసీ బస్సు ఆపక.. వృద్ధుల అవస్థలు

**నరసన్నపేట/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**
నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఆపకపోవడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాంప్లెక్స్ ప్లాట్‌ఫాం నంబర్1 నుంచి శ్రీకాకుళం వెళ్లాల్సిన ఏపీ 39 యూఎం 0337 నంబర్ బస్సు (సర్వీస్ నంబర్ 201) కనీసం నిమిషం కూడా ఆపకుండా కదిలిపోవడంతో ప్రయాణికులు పరుగులు తీయాల్సి వచ్చింది.




బస్సు కాంప్లెక్స్ ముందు రోడ్డుపై ఆగుతుందన్న ఆశతో పరుగెత్తిన బొరిగివలసకు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు గంగ రత్నం కిందపడిపోయారు. పోలాకి మండలం తోటాడ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు పీత పాపయ్య, ఆయన భార్య కూడా బస్సు ఎక్కలేక ఇబ్బందులు పడ్డారు.ఈ విషయమై 'జర్నలిస్టు వార్త' రిపోర్టర్ జాన్ డేవిడ్ డ్రైవర్‌ను ప్రశ్నించగా. అమర్యాదకరంగా సమాధానం ఇచ్చినట్లు ప్రయాణికులు ఆరోపించారు. 'ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకో.. ప్రెస్ రిపోర్టర్ అయితే ఎవడికి ఎక్కువ?' అంటూ దురుసుగా మాట్లాడినట్లు తెలిపారు.

### చర్యలు తీసుకోవాలి

బస్సు కోసం వృద్ధులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడటంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసన్నపేటకు చెందిన రత్నకుమారి, నాగరత్నం, శ్రీదేవి, భారతి, చిన్నమ్మడు, సుజాత, లలిత, అప్పలనరసమ్మ, అన్నపూర్ణ, శ్రీలక్ష్మి తదితరులు ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారు. ప్రయాణికులతో అమర్యాదగా వ్యవహరించిన డ్రైవర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, కాంప్లెక్స్ పాయింట్ వద్ద బస్సులు కనీసం ఐదు నిమిషాలు నిలిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# మొక్క నాటడం కాదు.. బతికించడమే లక్ష్యం!

**వన మహోత్సవంలో సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా**





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**మొక్కలు నాటి చేతులు దులుపుకుంటే ప్రయోజనం లేదని.నాటిన ప్రతి మొక్కను సంరక్షించి చెట్టుగా పెంచడమే అసలైన లక్ష్యమని ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని, గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.వన మహోత్సవంలో భాగంగా మంగళవారం ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సెంట్ అంతోని చర్చి ఆవరణలో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతకు చెట్లే కీలకమని, చెట్లు లేకపోతే భవిష్యత్ తరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.

నాటిన మొక్కలను వదిలేస్తే ఊరుకునేది లేదు..

వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటి వాటి సంరక్షణను గాలికొదిలేయడం సరికాదని సర్పంచ్ అన్నారు. ప్రతి మొక్కకు నీరు, రక్షణ కల్పిస్తూ అది చెట్టుగా ఎదిగే వరకు బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమం కాబట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే బాధ్యత తీసుకుంటే సరిపోదని.. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా మొక్కలను సంరక్షించాలని స్పష్టం చేశారు.గ్రామంలో ఖాళీ ప్రదేశాలు కనిపించిన ప్రతిచోటా మొక్కలు నాటి పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కలను నాటి వదిలేయడం వల్ల ప్రభుత్వ నిధులు, శ్రమ వృథా కావడమే కాకుండా వన మహోత్సవం ఉద్దేశం కూడా నీరుగారిపోతుందని పేర్కొన్నారు. నాటిన మొక్కల సంరక్షణపై గ్రామపంచాయతీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.

**పచ్చదనంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్**

కాలుష్యాన్ని తగ్గించేందుకు, వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకుంటే గ్రామం పచ్చని వనంగా మారుతుందని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ఇప్పటి నుంచే చెట్లను కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, గ్రామ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ కొంతం కొమురమ్మ, వివిధ వార్డుల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు. చర్చి ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రజల సహకారం అవసరమని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు.

# ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేలు

**మహబూబాబాద్/ ఆగస్టు 25 (జర్నలిస్ వార్త):**
రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో సాయం చేసి ప్రాణాలు కాపాడే వారికి కేంద్ర ప్రభుత్వం 'రహ్–వీర్' పథకం కింద రూ.25 వేల నగదు బహుమతి అందిస్తోందని జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్ తెలిపారు. ప్రమాదం జరిగిన తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తామని, ఆ సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందేలా చేసిన వారిని గుడ్ సమారిటన్‌గా గుర్తిస్తామని చెప్పారు.ప్రమాద బాధితులను ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం సాయం చేసిన వ్యక్తి తన వివరాలను ఆస్పత్రి సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. ఆస్పత్రి యాజమాన్యం ఆ వివరాలను పోలీసులకు పంపుతుందని, అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా కమిటీ పరిశీలించి అర్హులకు రూ.25 వేల బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తుందని వివరించారు.

చట్టపరమైన రక్షణ

ప్రమాద బాధితులకు సాయం చేసే వారిని చట్టపరంగా రక్షిస్తామని శంకర్ నాయక్ తెలిపారు. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 134(ఎ) ప్రకారం గుడ్ సమారిటన్లను విచారణ పేరుతో వేధించరాదన్నారు. ఆస్పత్రుల్లోనూ ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి ఏడాదిలో గరిష్ఠంగా ఐదుసార్లు ఈ బహుమతి పొందవచ్చన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి ప్రాణాలను కాపాడటంతో పాటు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ప్రజలకు డీటీఓ సూచించారు.



# దివ్యాంగురాలికి వీల్‌చైర్ పంపిణీ

**తల్లాడ/ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):**
దివ్యాంగులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించడం అభినందనీయమని తల్లాడ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీహరికృష్ణ అన్నారు. మంగళవారం ఇజ్రాయేల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఖమ్మంపాటి ఇజ్రాయేల్ ఆధ్వర్యంలో తల్లాడకు చెందిన దివ్యాంగురాలు బత్తుల నాగేంద్రమ్మకు వీల్‌చైర్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీహరికృష్ణ మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అని అన్నారు. సమాజంలో వెనుకబడిన దివ్యాంగులకు సహాయం అందించడం గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షుడు ఇజ్రాయేల్ మాట్లాడుతూ దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందించడం సంతోషంగా ఉందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ వెంకటేశ్వరరావు, నారపోగు ప్రసాద్‌బాబు, దారెల్లి బాబు, చల్లా దుర్గాప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# తల్లాడలో ఘనంగా వనమహోత్సవం

**తల్లాడ/ ఆగస్టు 25 (జర్నలిస్ వార్త):**
తల్లాడ పట్టణంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఎంపీడీవో అంబటి శ్రీధర్ రాజు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.ఉమా, ఎమ్మార్వో కరుణాకర్ రెడ్డి, ఈఓ, ఎంపీవో శ్రీ హరికృష్ణ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.



ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. తల్లాడలో పచ్చదనం పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని తెలిపారు. ఎంపీడీవో శ్రీధర్ రాజు మాట్లాడుతూ వనమహోత్సవం మొక్కలు నాటడంతో ముగియకుండా వాటి సంరక్షణ ఉద్యమంగా కొనసాగాలని అన్నారు.ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉమా మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు చెట్లు ఎంతో కీలకమన్నారు. ఎమ్మార్వో కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ పచ్చదనం పెరిగితే ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందన్నారు. ఈఓ, ఎంపీవో హరికృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛ, పచ్చని తల్లాడ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, ఏపీవో కోటయ్య, జేఈ అరుంధతి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# టీపీసీసీ ఉపాధ్యక్షుడికి కరాటే శిష్యుల జన్మదిన శుభాకాంక్షలు

**హసన్‌పర్తి/ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** హసన్‌పర్తి మండలం కోమటిపల్లి గ్రామంలోని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర బుడోకాన్ కరాటే ఉపాధ్యక్షుడు నమ్మిండ్ల శ్రీనివాస్ నివాసంలో మంగళవారం ఆయన 57వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కరాటే శిష్యులు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ (బ్లాక్ బెల్ట్), పాశం దేవయ్య (బ్లాక్ బెల్ట్) కలిసి శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శిష్యులు మాట్లాడుతూ.. కరాటే రంగంలో తమకు మార్గనిర్దేశం చేస్తూ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ నమ్మిండ్ల శ్రీనివాస్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. తమ గురువు జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం ఆనందంగా ఉందన్నారు.



# పేదల వైద్యంలో నిర్లక్ష్యం సహించం

**వావిలాల పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన వొడితల ప్రణవ్**

**జమ్మికుంట/ ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**
వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ హెచ్చరించారు. జమ్మికుంట మండలం వావిలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణతో పాటు వివిధ విభాగాలను పరిశీలించి.పేదలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.పీహెచ్‌సీ నిర్వహణ తీరుపై సంబంధిత అధికారులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు సకాలంలో వైద్యం, అవసరమైన మందులు, మెరుగైన సౌకర్యాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆసుపత్రి నిర్వహణలో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతోందన్నారు. అలాంటప్పుడు క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ లక్ష్యం దెబ్బతినకూడదని పేర్కొన్నారు. పేదలకు అందించే వైద్యంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.వావిలాల పీహెచ్‌సీలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వావిలాల సర్పంచ్ అర్జున్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరశురామారావు, పొనగంటి మల్లయ్య, సారంగపాణి, సజ్జు జమ్మికుంటతో పాటు వావిలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.ద




## ఈ నెల 27న పంచాయతీలలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రదర్శన.

**-తహసీల్దార్ నాగరాజు.**

**బయ్యారం,ఆగస్టు 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల వ్యాప్తంగా ఈ నెల 27న అన్ని గ్రామ సభలలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. అనామలిస్,నాన్ మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నోటీసులో ఇచ్చిన తేది ప్రకారం సంబంధించిన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ నుండి హియరింగ్ ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంపై మండలంలోని రాజకీయ పార్టీల, ప్రతినిధులతో,బిఎల్ఓలతో సమావేశం నిర్వహించమన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బిఎల్వోలు,సూపర్వైజర్లు పాల్గొన్నారు.



# ప్రజల నమ్మకమే పోలీసుల బలం

**గ్రామాల్లోకి పోలీసింగ్.. నేరాలపై నిఘా ముమ్మరం -గంజాయి, నాటుసారాపై ఉక్కుపాదం.. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి**

**మహబూబాబాద్/ ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**ప్రజల విశ్వాసమే సమర్థవంతమైన పోలీసింగ్‌కు బలమని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ అన్నారు. పోలీసింగ్ పోలీస్‌స్టేషన్లకే పరిమితం కాకుండా గ్రామస్థాయికి చేరాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. మంగళవారం మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

స్టేషన్‌లోని రికార్డులు, కేసు డైరీలు, దర్యాప్తు పత్రాలు, పరికరాలు, వివిధ విభాగాల గదులు, పరిసరాల పరిశుభ్రత, రిసెప్షన్ నిర్వహణను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడి విధుల్లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

**పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి**

పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై ఎస్పీ సమీక్షించారు.



కేసు డైరీలు, దర్యాప్తు పత్రాలను పరిశీలించారు. ప్రతి కేసులో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలను సేకరించాలని ఆదేశించారు. శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు చేపట్టి నాణ్యమైన ఫలితాలు సాధించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

**వారానికి ఒకసారి గ్రామాల్లో పర్యటన**

విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో తప్పనిసరిగా పర్యటించాలని ఎస్పీ ఆదేశించారు. వారానికి కనీసం ఒకసారైనా గ్రామాలకు వెళ్లి ప్రజలతో మమేకం కావాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని పోలీసు శాఖ దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించాలని సూచించారు.

**మత్తు పదార్థాలపై నిఘా**

గంజాయి, నాటుసారా, ఇతర అక్రమ మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ ఆదేశించారు. నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాపై నిరంతరం దాడులు నిర్వహించాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నేరాలను ముందుగానే గుర్తించి అరికట్టేందుకు క్షేత్రస్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి వారి విశ్వాసాన్ని పొందినప్పుడే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని అన్నారు. తనిఖీలో డీఎస్పీ తిరుపతిరావు, సీఐ అంజలి, ఎస్ఐ రాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులతో పనులు చేయిస్తే చర్యలు

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**మిర్యాలగూడ/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**



విద్యార్థులతో పాఠశాల, వసతి గృహ పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. తుంగపాడు గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ వసతి గృహంలో విద్యార్థులతో పనులు చేయిస్తున్నారంటూ విద్యార్థి సంఘాల నుంచి ఫిర్యాదులు అందడంతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోడల్ స్కూల్‌తో పాటు పలు గురుకుల పాఠశాలలను సందర్శించి వసతి గృహాలు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలపై పాఠశాల యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు చదువుకోవడానికి పాఠశాలలు, గురుకులాలకు వస్తారని, వారితో ఎలాంటి పనులు చేయించడం సరికాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోపణలు వాస్తవమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చూడటంతో పాటు వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. విద్యార్థుల సమస్యలు, ఫిర్యాదులపై అధికారులు, యాజమాన్యాలు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించినా, విధుల్లో నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని బీఎల్ఆర్ స్పష్టం చేశారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే సండ్ర విమర్శలు



**తల్లాడ/ఆగస్టు 25(జర్నలిస్ట్ వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ తల్లాడ మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తల్లాడలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ రెండున్నరేళ్లలోనే జరిగిందన్నారు. సిరిపురం మేజర్ కాలువ మరమ్మతులు పూర్తయిన వెంటనే మరో ఐదు రోజుల్లో సాగర్ జలాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అన్నారుగూడెం ఎస్సీ కాలనీలకు వరద ముప్పు లేకుండా రిటైనింగ్ గోడలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, వైరా మార్కెట్ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, జక్కంపూడి కిషోర్, తాళ్ల జోసెఫ్, తెలగవరం సర్పంచ్ కాళోజి, మంగాపురం ఉపసర్పంచ్ చింటూ, మాజీ జెడ్పీటీసీ మూకర ప్రసాద్, మారెళ్ల మల్లికార్జునరావు, కేవీహెచ్‌డీ కృష్ణారెడ్డి, గణేశుల రవి, తుమ్మలపల్లి రమేష్, గొడుగునూరి శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కూసురి వెంకటేశ్వర్లు, కోడూరు రాము, ఎస్టీ సెల్ నాయకుడు ధర్మశోత్తు దశరథ్ నాయక్, ఎస్సీ సెల్ నాయకుడు తాళ్ల వెంకటి, మాజీ జెడ్పీటీసీ కంచపోగు వెంకటేశ్వరరావుతో పాటు సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణే ముఖ్యం

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి - ఎంపీడీవో క్రాంతి, సర్పంచ్ ధరావత్ యమున సుమన్ నాయక్**

**కేసముద్రం/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కేసముద్రం ఎంపీడీవో క్రాంతి, నారాయణపురం సర్పంచ్ ధరావత్ యమున సుమన్ నాయక్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం నారాయణపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో క్రాంతి మాట్లాడుతూ.. చెట్లు మానవ మనుగడకు ఎంతో కీలకమన్నారు. స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్‌తోపాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో వృక్షాల పాత్ర కీలకమని తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో విరివిగా మొక్కలు నాటి వాటిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. చెట్ల సంఖ్య పెరిగితే ఉష్ణోగ్రతలు తగ్గడంతోపాటు వాతావరణంలో సమతుల్యత ఏర్పడి వర్షపాతం మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు.

**ప్రతి గ్రామంలో 3,800 మొక్కలు**

ప్రతి గ్రామంలో సెప్టెంబర్ నాటికి 3,800 మొక్కలు




నాటేలా ప్రణాళిక రూపొందించామని ఎంపీడీవో తెలిపారు. మొక్కలు నాటడమే లక్ష్యంగా కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. గ్రామస్థులు కూడా కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలను సంరక్షించాలని కోరారు.

**భవిష్యత్ తరాలకు పచ్చని సంపద**

సర్పంచ్ ధరావత్ యమున సుమన్ నాయక్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆస్తులతోపాటు పచ్చని ప్రకృతి సంపదను అందించాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉందన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో పచ్చదనం పెంచేందుకు పంచాయతీ తరఫున అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో యాకాంబరం, మాజీ సర్పంచ్ ఉకంటి సారంగరెడ్డి, ఉపసర్పంచ్ గుగులోత్ లచ్చు, వార్డు సభ్యులు తాడూరి కవిత ఉమేష్, పోగులకొండ అశోక్, పంచాయతీ కార్యదర్శి మంద చంద్రయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్, వీవో అధ్యక్షురాలు కొయగూరి అనిత, అంగన్వాడీ టీచర్లు ఎడవెల్లి జ్యోతి, గుగులోత్ సునీత, గ్రామస్థులు ఎడవెల్లి వెంకట్‌రెడ్డి, అన్నారపు యాదగిరి, రూపిరెడ్డి అశోక్‌రెడ్డి, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గుగులోత్ కిషన్, పోలేపాక మల్లయ్య, సొంటిరెడ్డి పద్మ, ముచ్చ సులోచన, సుంకిరెడ్డి సుజాత, బొబ్బాల స్వప్న, పోలేపాక ఈశ్వరి, జీపీ సిబ్బంది పందుల మధు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల సంరక్షణే కీలకం

**వన మహోత్సవంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**




**మిర్యాలగూడ/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మిర్యాలగూడ డివిజన్ అటవీ శాఖ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పచ్చదనం పెంపొందితే పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని పేర్కొన్నారు. వన మహోత్సవం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని కాపాడాలని కోరారు. మున్సిపాలిటీ, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పచ్చదనం కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని సూచించారు.

నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరందించి, పశువుల బారిన పడకుండా రక్షణ కల్పించాలని అధికారులకు సూచించారు. మొక్కల పెరుగుదలను పర్యవేక్షిస్తూ వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఆడోత్ అశోక్, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ద

# కాంగ్రెస్‌లోకి జోరుగా కొనసాగుతున్న చేరికలు



**జమ్మికుంట/ ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**జమ్మికుంట మండలంలో కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. తాజాగా మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూర్చేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరశురామారావు, పొనగంటి మల్లయ్య, సారంగపాణి, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీను, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాగర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కుమార్, నాయకులు రాజు, చందు, ఓదెలు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణా బాధ్యతే!

**వనమహోత్సవానికి బండౌతాపురంలో శ్రీకారం**

**ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య**

**హసన్‌పర్తి/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, మొక్కలు నాటి వాటిని సంరక్షించినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య అన్నారు. వర్ధన్నపేట మండలం బండౌతాపురం గ్రామంలో వనమహోత్సవం2026 కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, సర్పంచ్ బత్తిని దశరథంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఊరచెరువు కట్టపై గుల్మోహర్ మొక్కను నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



ఈ సందర్భంగా నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, హరిత తెలంగాణ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం2026 కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వృక్షాలు సకల జీవకోటికి జీవనాధారం అనే నినాదంతో ప్రతి గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. బండౌతాపురం ఊరచెరువు కట్టపై పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం జరిగిందన్నారు.

మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని సూచించారు. నేడు నాటిన మొక్కలే రేపటి తరాలకు నీడనిచ్చే వృక్షాలుగా ఎదుగుతాయని, పచ్చదనం పెంపొందితే వాతావరణ మార్పుల ప్రభావాన్ని కొంతవరకు అడ్డుకోవచ్చన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉపసర్పంచ్ మంద సుకన్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సినపెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలి

**సామాజిక సమానత్వం కోసం పోరాటాలకు సిద్ధం కావాలి. మాసాని గోపాల్ మాదిగ**





**గీసుకొండ/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**

మాదిగల హక్కుల సాధన కోసం భవిష్యత్ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి, మాజీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాదిగ పిలుపునిచ్చారు. గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో నాగారపు సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన గ్రామ కమిటీల ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆశయాలకు అనుగుణంగా ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని, ప్రభుత్వ హామీలను అమలు చేయించేందుకు ఐక్యంగా పోరాడాలని మాసాని గోపాల్ మాదిగ అన్నారు. సామాజిక సమానత్వం సాధించే వరకు ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

**నూతన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కమిటీ..**

అధ్యక్షుడు పరికె రమేష్ మాదిగ, ఉపాధ్యక్షుడు తగరపు వంశీ మాదిగ, ప్రధాన కార్యదర్శి బస్కే రంజిత్ కుమార్ మాదిగ. సలహాదారులు నాగారపు సుధాకర్ మాదిగ, మామునూరు శ్యామ్ మాదిగ, తగరపు అశోక్ మాదిగ. నూతన మాదిగ విద్యార్థి సమాఖ్య కమిటీ.. అధ్యక్షుడు కుర్రి రమేష్ మాదిగ, ఉపాధ్యక్షుడు బస్కే పవన్ మాదిగ, ప్రధాన కార్యదర్శి మామను సుమంత్ మాదిగ.

## 16వ వార్డులో సీసీ రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలి

### సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



**కేసముద్రం/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు తాగునీటి నల్లాల సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం టౌన్ కార్యదర్శి జల్లే జయరాజు మాట్లాడుతూ.. సింగారపు అనిల్ ఇంటి పక్క నుంచి పాత పోలీస్‌స్టేషన్, చైతన్యనగర్‌కు వెళ్లే రహదారి గుంతలమయంగా మారిందన్నారు. వర్షం పడితే నడవడానికి కూడా వీలులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు, తాగునీటి సమస్యలను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు తాగునీటి నల్లాల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మురికికాలువలు, రహదారుల వెంట దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చాగంటి కిషన్, కాలనీవాసులు నీరుడు పద్మ, వల్లందాస్ సుదర్శన్, ఇసంపల్లి డేవిడ్‌రాజ్, సోమనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం.. ఇద్దరికి చూపు ప్రసాదించే మహాదానం



**హనుమకొండ/ ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో మంగళవారం నేత్రదానం, అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించే నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రజలకు నేత్రదానం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మరణించిన వ్యక్తి కళ్లను సకాలంలో సేకరించి, కార్నియా మార్పిడి ద్వారా అవసరమైన వారికి చూపును అందించవచ్చని తెలిపారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, మరణానంతరం నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులు వీలైనంత త్వరగా సమీపంలోని నేత్రదాన కేంద్రం లేదా సంబంధిత ఆసుపత్రికి సమాచారం అందించాలని సూచించారు. కుల, మత, వయస్సు వంటి భేదాలకు అతీతంగా నేత్రదానం చేయవచ్చని, మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే మహత్తర సేవగా నేత్రదానాన్ని భావించాలని కోరారు.
నేత్రదానందృష్టిదానం. అవయవదానంఅమూల్యదానం అనే సందేశంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ప్రతినిధులు, దాతలు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్యేకు ఎస్ఎఫ్ఐ వినతి

**పరకాల/ ఆగస్టు 25 (జర్నలిస్ వార్త):ది**



పరకాల పట్టణంలోని విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు నిర్మించాలని, కళాశాల ప్రధాన గేటు వద్ద అటెండర్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. యువత, విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు పరకాలలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన నిధులు మంజూరు చేసి సౌకర్యాలు కల్పించాలని కళ్యాణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, మండల అధ్యక్షుడు కోగీల సాయి తేజ, మండల ఉపాధ్యక్షుడు కొమ్ముల రాహుల్, శివ, భరత్, సన్నీ, మహేష్, సందీప్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్



**కేసముద్రం/ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి పౌరుడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్క నాటడంతో బాధ్యత పూర్తికాదని, అది మహావృక్షంగా ఎదిగే వరకు సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీ. శ్రీనివాసరావు, కౌన్సిలర్లు తరాల వీరేష్ యాదవ్, పయిరాల శరత్ యాదవ్, రావుల వినయ్, దూడపాక కృష్ణ, బానోత్ అరుణకుమారి, మేకల శారదతో పాటు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు

## భాషా దోషాలు లేకుండా చదవడం, రాయడం నేర్చుకోవాలి



**కేసముద్రం/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):**విద్యార్థులు ఒత్తులు, పొల్లుల్లో తప్పులు లేకుండా ధారాళంగా చదవడం, రాయడం నేర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ యాదగిరి సూచించారు. కేసముద్రం స్టేషన్ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్‌లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'ప్రథమ భాష' తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పలువురు విద్యార్థులు ఒత్తులు, పొల్లులు సరిగా రాయలేకపోతున్నారని తెలిపారు. శిక్షణ అనంతరం వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆర్పీలు సురేష్, డాక్టర్ తండా హరీష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు బోధనా ఉపకరణాలను సమర్థంగా వినియోగించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాల ప్రథమ భాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**హుజురాబాద్/ఆగస్టు 25(జర్నలిస్ట్ వార్త):** తుమ్మనపల్లి గ్రామంలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అధ్యక్షుడిగా బొక్కల రాంరెడ్డి (చంద్రారెడ్డి కుమారుడు) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఏనుగు తిరుపతిరెడ్డి, కోశాధికారిగా బొక్కల నందిరెడ్డి, సహాయ కార్యదర్శిగా మిడిదొడ్డి మల్లికార్జున్, గౌరవ అధ్యక్షులుగా గ్రామ సర్పంచ్ అన్నాడి మాధవిరవీందర్‌రెడ్డి, గౌరవ సహాయ సలహాదారుగా యాళ్ల యతీశ్వర్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ యువజన నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెట్టెం నవీన్‌కు అభినందనలు



**హసన్‌పర్తి/ ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** గాంధీభవన్‌లో టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్‌గా పెట్టెం నవీన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లు హాజరయ్యారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. సోషల్ మీడియా ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించినట్లు వారు తెలిపారు.
ఎమ్మెల్యేను కలిసిన వారిలో వర్ధన్నపేట సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుట్ట తిరుపతి, హసన్‌పర్తి మండల కోఆర్డినేటర్ బిగుళ్ల సురేష్, కాజీపేట కోఆర్డినేటర్ బస్కే ప్రణయ్, ఐనవోలు మండల కోఆర్డినేటర్ కట్కూరి సునీల్, వర్ధన్నపేట కోఆర్డినేటర్ దాడి సందీప్, పర్వతగిరి కోఆర్డినేటర్ వంగ సాయికృష్ణ యాదవ్, 44వ డివిజన్ కోఆర్డినేటర్ బోంధుగుల సతీష్ తదితరులు ఉన్నారు.

## నమహోత్సవంలో మొక్కలు నాటిన ఏఎంసీ చైర్మన్



**వర్ధన్నపేట/ఆగస్టు 25(జర్నలిస్ట్ వార్త);** బండౌతాపురం గ్రామంలో మంగళవారం వనమహోత్సవం-2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, సర్పంచ్ బత్తినీ దశరథంతో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఊర చెరువు కట్టపై గుల్మోహర్ మొక్కను నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని వెంకటయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉపసర్పంచ్ మంద సుకన్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సినపెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో ఇండోర్ క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి



**బయ్యారం/ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండలం కొత్తపేటలో ఇండోర్ బ్యాడ్మింటన్, కబడ్డీ సింథటిక్ కోర్టులు ఏర్పాటు చేయాలని క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ వినతిపత్రం అందించారు. ఇందుకోసం రూ.కోటి అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. బ్యాడ్మింటన్ కోర్టుకు రూ.60 లక్షలు, కబడ్డీ కోర్టుకు రూ.40 లక్షలు అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, అవకాశాలు కల్పించేందుకు ఇవి ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

### అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నేతల వినతిపత్రం



**కేసముద్రం/ ఆగస్టు 25 (జర్నలిస్ వార్త):**
విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా మంగళవారం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు.
అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి.. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై అనేక రూపాల్లో నిరసనలు చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లెంకలపల్లి శ్రీనివాస్, ముదిరెడ్డి మురళీధర్‌రెడ్డి, మంగిశెట్టి నాగయ్య, శీలం శ్రీనివాస్, బానోత్ సంపత్, బానోత్ యాకూబ్, ఎలుబోయిన కరుణాకర్, చిత్తూజు చక్రధర్, కొండ్రెడ్డి వీరారెడ్డి, వల్లందాస్ నగేష్, వేల్పుల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు

## వనమహోత్సవం సామాజిక బాధ్యత



**మహబూబాబాద్/ఆగస్టు 25 (జర్నలిస్ వార్త):**వనమహోత్సవాన్ని సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. మంగళవారం ఈదులపూసపల్లి లేక్ వ్యూ నేచర్ పార్క్ వద్ద డీఎఫ్ఓ బి.లావణ్యతో కలిసి మొక్కలు నాటారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు మొక్కల పెంపకం తప్పనిసరన్నారు. జిల్లాకు నిర్దేశించిన 43.51 లక్షల మొక్కల నాటే లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కకు ట్రీగార్డు ఏర్పాటు చేసి, నీరు పోస్తూ సంరక్షించాలని సూచించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల వెంట నాటిన మొక్కలను జియో ట్యాగింగ్‌తోపర్యవేక్షించాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో కనీసం ఒక మొక్క నాటాలని కోరారు. అనంతరం నందనవనం పార్కును పరిశీలించిన కలెక్టర్ అభివృద్ధి పనులపై తక్షణమే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పురుషోత్తం, డీఆర్‌డీవో పీడీ మధుసూదన రాజు, డీపీఆర్ఓ రాజేంద్రప్రసాద్, ఎఫ్‌డీవో ఏ.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వినోద్, ఎఫ్ఆర్ఓ సురేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, తహసీల్దార్ రాజేశ్వర్, కౌన్సిలర్, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.ది

## వనమహోత్సవంలో మొక్కలు నాటిన సర్పంచ్ కృష్ణవేణి



**తల్లాడ/ ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** వనమహోత్సవంలో భాగంగా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామపంచాయతీలో సర్పంచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. ఇంటి పరిసరాలతో పాటు వ్యవసాయ పొలాల్లోనూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గ్రామపంచాయతీ నర్సరీలో వివిధ రకాల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు వాటిని ఉచితంగా తీసుకెళ్లి తమ పరిసరాల్లో నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించినప్పుడే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రజలు, మహిళలు, యువత, చిన్నారులు భాగస్వాములు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జక్కంపూడి కిషోర్, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ఇనుపనూరి కృష్ణ, జక్కంపూడి రమేష్, పంచాయతీ గుమస్తా లాజర్, పౌలు, మల్టీపర్పస్ సిబ్బంది, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వనమహోత్సవం ప్రారంభం







**వర్ధన్నపేట/ఆగస్టు 25(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం వనమహోత్సవాన్ని మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి, ఇన్‌చార్జి కమిషనర్ కమ్మం కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, కౌన్సిలర్లు, నాయకులు సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, నేతావత్ రాజేందర్, ఎం.డి. అప్సర్, తిరుపెల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో బస్ షెల్టర్.. కొత్త షెల్టర్ మంత్రి పొన్నం హామీ

### మంత్రి పొన్నం ఆదేశాలతో బస్ షెల్టర్ పరిశీలన





**భీమదేవరపల్లి/ఆగస్టు25 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలోని బస్ స్టేజీని మంగళవారం వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భానుప్రసాద్ సందర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు గ్రామానికి వచ్చి శిథిలావస్థలో ఉన్న బస్ షెల్టర్‌ను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్‌కుమార్ బస్ షెల్టర్ పరిస్థితిని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి అత్యాధునిక బస్ షెల్టర్‌ను త్వరితగతిన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా సంబంధిత ఆర్టీసీ అధికారులను గ్రామానికి పంపించి స్థలాన్ని పరిశీలించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భానుప్రసాద్ వెంట ఈఈ శ్రీకాంత్, ఏఈ మల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్‌కుమార్, ఉపసర్పంచ్ బొడిగె శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గుడికందుల మధు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొన్నాల మురళి, వార్డు సభ్యులు బొల్లంపల్లి షెడ్రెక్, కాసనగొట్టు సాయిరాం, బొల్లంపల్లి సుశాంత్ తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎపిలో సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం

### పునరుత్పాదక ఇంధన రంగంలో ముందుంటాం

### హులికెరలో సుజ్లాన్ విండ్ పవర్‌కు శంకుస్థాపప




**అనంతపురం,ఆగస్టు 25:.(జర్నలిస్ట్ వార్త)**ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ గ్రూప్ చేపడుతున్న ప్రాజెక్టుల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అదనంగా 1.3 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుజ్లాన్ గ్రూప్ పెట్టుబడులు పెడుతోందని నారా లోకేష్ వెల్లడించారు. ఉరుకొండ వద్ద ఉన్న బ్లేడ్ల తయారీ యూనిట్ విస్తరణతో పాటు కొత్త ప్రాజెక్టుల ద్వారా దాదాపు 4,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. 2016లో ప్రారంభమైన అనంతపురం సుజ్లాన్ ప్లాంట్ ద్వారా ఇప్పటికే సుమారు 2,000 మందికి ఉపాధి లభించిందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో దాదాపు 70 శాతం మంది స్థానిక యువత ఉండటం సంతోషకరమన్నారు. స్థానిక ఐటీఐలను దత్తత తీసుకుని శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. సుజ్లాన్ సంస్థ వర్క్‌ఫోర్స్‌లో 40 శాతం మంది మహిళలు ఉండటం అభినందనీయమని నారా లోకేష్ అన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరగడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు. పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులతో నెలవారీ సమావేశాలు నిర్వహించి పరిశ్రమలకు ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక అడ్వైజరీ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. పెట్టుబడులు ఆలస్యం కాకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగానికి అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేసి భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నారా లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని కణెకల్లు మండలం హులికెరలో సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్ట్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. అలాగే సుజ్లాన్ 144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్‌ను ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ సంస్థ రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సుజ్లాన్ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలో సుజ్లాన్ ఇప్పటికే కీలక పవన్ విద్యుత్ సంస్థగా ఎదిగింది. ఏపీలో ఈ సంస్థకు 1700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యం ఉంది. ఇది 2030 నాటికి అదనంగా 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని సుజ్లాన్ ప్రణాళికలు రూపొందించింది. నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకునేందుకు ఈ సంస్థ ముందుకు సాగుతోంది.

# స్థానిక ఎన్నికల్లో పట్టుదలగా పనిచేయాలి

**నియోజకవర్గాన్ని వదిలి బయటకు వెళ్లరాదు**

**ఎన్నికల్లో గెలుపు వైసిపికి అత్యంత ముఖ్యం**

**అధికార దుర్వినియోగం జరగకుండా అడ్డుకోవాలి**

**పార్టీ ముఖ్యనేతలతో ఎన్నికలపై జగన్ దిశానిర్దేశం**



**అమరావతి,ఆగస్టు 25:.(జర్నలిస్ట్ వార్త)**
స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే ప్రజలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పష్టమైన తీర్పు ఇస్తారని అన్నారు. గతంలో స్థానిక ఎన్నికల సందర్భంగా అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు, ప్రలోభాలు చూశామని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆషామాషీగా తీసుకోవద్దని జగన్ సూచించారు. ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కాదని, పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన ఎన్నికలని అన్నారు. అధికార పార్టీ నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, దౌర్జన్యాలు ఎదురైనా నాయకుడు తమ వెంట ఉన్నాడనే భరోసా కార్యకర్తలకు కల్పించాలని సూచించారు. పార్టీ ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు జగన్.. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీలు హాజరయ్యారు..ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటన తమకు అనుకూలంగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జడ్పీ చైర్మన్, మేయర్ వంటి కీలక పదవులకు బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని పార్టీ నేతలకు సూచించారు. అవసరమైన చోట కార్యకర్తలకు అండగా నిలిచేందుకు కుటుంబ సభ్యులను కూడా పోటీలోకి దింపడానికి వెనుకాడవద్దని అన్నారు. ఏకగ్రీవాలకు అంగీకరిస్తే కఠిన నిర్ణయాలు ఉంటాయని జగన్ హెచ్చరించారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలు జరిగేందుకు అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే, తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి కో-ఆర్డినేటర్లు పార్టీ అభ్యర్థులుగా ఉండరని తెలిపారు. ఎన్నికల అనంతరం అభ్యర్థులను ఎక్కడెక్కడ నిలబెట్టారు, వారికి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా మద్దతిచ్చారనే అంశాలపై నివేదికలు తీసుకుంటానని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో అభ్యర్థి వ్యక్తిగత బలం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో భావోద్వేగాలు, వ్యక్తిగత ఈగోలకు తావివ్వకుండా అందరినీ కలుపుకొని వెళ్లాలని సూచించారు. ఒక్కో ఓటు కూడా కీలకమని, తొమ్మిది ఓట్లతో గెలిచిన సందర్భాలు, తొమ్మిది ఓట్లతో ఓడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. 'గెలుపే ముఖ్యం.. గెలుపు కోసం ఈగోలను పక్కన పెట్టాలి' అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి, సమర్థుడైన కార్యకర్త చుట్టూ ఏకాభిప్రాయం తీసుకురావాలని జగన్ సూచించారు. రాబోయే 60 నుంచి 70 రోజులు నాయకులు తమ నియోజకవర్గాలను దాటి వెళ్లకుండా స్థానిక ఎన్నికలపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని అన్నారు. ఇంటింటి ప్రచారం ద్వారా వైఎస్సార్‌సీపీ పాలన, కూటమి పాలన మధ్య ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలని సూచించారు.
పోలీసు అధికారులు తమ పదవులను దుర్వినియోగం చేయకుండా న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జగన్ కోరారు. కార్యకర్తలను వేధించే లేదా అన్యాయం చేసే అధికారుల వివరాలను నమోదు చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారులపై భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తటస్థంగా వ్యవహరించాలని కోరారు వైసీపీ అధినేత వైఎస్ జగన్..

## మొట్ల తిమ్మాపురంలో ఘనంగా వన మహోత్సవం.
## -వన్యప్రాణులకు నీటి వసతి.



**బయ్యారం,ఆగస్టు 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని మొట్ల తిమ్మాపురం ఇస్ట్ బీట్ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు,గ్రామస్తులతో కలిసి నీటి గుంటలు,చెక్ డ్యాములు నిర్మించే కార్యక్రమం మొదలు పెట్టారు.ఈ సందర్భంగా బయ్యారం రేంజ్ ఆఫీసర్ రవికిరణ్ మాట్లాడుతూ తెలంగాణ వన మహోత్సవం సాధారణ కార్యక్రమం కాదని,భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి,పచ్చని ప్రకృతి,ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించాలనే గొప్ప సంకల్పానికి ప్రతీక అని అన్నారు.చెట్లు మనకు ఆక్సిజన్,నీడను అందించడంతో పాటు వర్షాలను ఆకర్షించడంలో, భూగర్భ జలాలను కాపాడడంలో,నేల కోతను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.పక్షులు, జంతువులకు చెట్లు ఆవాసాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.అందుకే చెట్టు ఉంటేనే జీవితం అడవి ఉంటేనే భవిష్యత్తు అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బిట్ అధికారులు,బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బయ్యారం సర్పంచ్.



**బయ్యారం,ఆగస్టు 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బొడ్రాయి బజారులోని రైతు వంగాల బిక్షం కొద్దిరోజులు క్రితం బయ్యారం బోనాల జాతర సమయంలో తీవ్ర అనారోగ్యంతో మరణించారు.ఈ విషయం తెలుసుకొన్న బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి తల్లి,భార్య పిల్లలతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి,మనోధైర్యం కల్పించారు.వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వంగాల బిక్షం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా,బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కంబాల ముసలయ్య,కిసాన్ జిల్లా ప్రధానకార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు,బయ్యారం మాజీ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,తాటి జనార్ధన్, ఏనుగుల రంజిత్,తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం పెద్ద చెరువుకు సీతారామ జలాలు

### అదనపు ఆయకట్టు పనులకు అనుమతులివ్వాలి :ఎమ్మెల్యే కోరం కనకయ్య



**బయ్యారం/ ఆగస్టు 25 (జర్నలిస్ట్ వార్త):** సీతారామ ఎత్తిపోతల పథకం కింద ఇల్లందు నియోజకవర్గంలో ప్రతిపాదించిన అదనపు ఆయకట్టు పనులకు తక్షణం పరిపాలనా అనుమతులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. మంగళవారం జలసౌధలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.లలితాపురం చెరువు వద్ద నీటి పంపిణీ తొట్టిని ఏర్పాటు చేసి, గురుత్వాకర్షణ ద్వారా బయ్యారం పెద్ద చెరువుకు సీతారామ జలాలను తరలించాలని ఎమ్మెల్యే సూచించారు. చెరువు సామర్థ్యాన్ని పెంచి అక్కడి నుంచి తులారం ప్రాజెక్టుకు నీటిని తరలిస్తే రెండు పంటలకు సాగునీటితో పాటు మహబూబాబాద్ పట్టణ తాగునీటి అవసరాలు కూడా తీర్చవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూల మధుకర్‌రెడ్డి, బయ్యారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూలకంటి సీతారాంరెడ్డి, సర్పంచ్‌లు భూక్యా ప్రవీణ్‌నాయక్, లింగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలలకు హెచ్‌ఐవీ, ఎస్‌టీఐ, టీబీ పరీక్షలు చేయించుకోవాలి

### వ్యాధులపై అవగాహనతోనే ఆరోగ్యకరమైన సమాజం



**భీమదేవరపల్లి/ఆగస్టు (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం వైఆర్జీ కేర్ సీఎల్‌డబ్ల్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎస్‌టీఐ, టీబీ వ్యాధులపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పి.జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఆర్జీ కేర్ ప్రతినిధి కె.లలిత విద్యార్థినులకు వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలపై వివరించారు. హెచ్‌ఐవీ ప్రధానంగా సురక్షితం కాని లైంగిక సంబంధాలు, క్రిమిరహితం చేయని సూదులు, పరీక్షించని రక్తం, హెచ్‌ఐవీ ఉన్న తల్లి నుంచి బిడ్డకు వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌ఐవీ, ఎస్‌టీఐ, టీబీ పరీక్షలు ఉచితంగా చేయించుకోవాలని సూచించారు. పరీక్షల వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని, బాధితులను సమాజం నుంచి దూరం చేయరాదని పేర్కొన్నారు. వ్యాధులకు సంబంధించిన సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్ 1097ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.